క్లుప్తంగా

ఇంజినీరింగ్ విద్య, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై అవగాహన

అమలాపురం టౌన్: స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులోని శుభ గృహ ఫంక్షన్ హాలులో ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆ విద్య, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను సాధించే అంశాలపై పలువురి విద్యావేత్తలతో అవగాహన సదస్సు బుధవారం జరిగింది. కైట్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కైట్ చైర్మన్ విశ్వం, ప్రిన్సిపల్ సరస్వతి, ప్రొఫెసర్ రామకృష్ణ, అకడమిక్ డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాగాదిత్యకు పంచాంగ వైభవ రత్న అవార్డు


పంచాంగకర్త ఉపద్రష్ట నాగాదిత్య

అమలాపురం టౌన్: పంచాంగ కర్త ఉపద్రష్ట నాగాదిత్యకు పంచాంగ వైభవ రత్న అవార్డు లభించింది. హైదరాబాద్ లలిత కళా సమాఖ్య (సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ) స్వాతంత్ర్య దినోత్సవ 31వ సువర్ణ కంకణ అవార్డుల సంబరాల్లో భాగంగా నాగాదిత్యను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. వచ్చే ఆగస్టు 3వ తేదీ ఉదయం 9 గంటలకు హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభ హాలులో పంచాంగకర్త నాగాదిత్యకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు పంచాంగ కర్త నాగాదిత్యకు లిఖిత పూర్వక సమాచారం అందించారు. అమలాపురంలో పంచాంగ కర్త అయిన ఆయన తండ్రి దివంగత ఉపద్రష్ట కృష్ణమూర్తి బాటలోనే నాగాదిత్య పంచాంగ కర్త, పురోహిత బ్రహ్మగా సేవలు అందిస్తున్నారు.

నడిపూడి రిజర్వాయర్ పరిశీలన

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో తాగు నీటి సమస్యలు రోజురోజుకు తీవ్రతరమవుతున్న క్రమంలో పంట కాలువ నుంచి రా వాటర్ పంపింగ్ ద్వారా నీటి నిల్వతో ఉండే నడిపూడిలోని 44 ఎకరాల రిజర్వాయర్ (చెరువు)ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం పరిశీలించారు. పంట కాలువలపై రెండు వంతెనలు నిర్మాణం వల్ల మున్సిపాలిటీలో తాగునీటి వనరుల నిల్వలతో ఉండే మూడు రిజర్వాయర్లలో నీరు అడుగంటుతున్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. తాగునీటి సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్‌కు సూచించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు తదితరులు ఉన్నారు.

శ్మశాన వాటిక స్థలం అప్పగింత

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలో చేపట్టిన రీసర్వేలో భాగంగా బుధవారం శ్మశాన వాటిక స్థలాన్ని పంచాయతీకి అప్పగించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తెలిపారు. తహసీల్దార్ పితాని త్రినాథరావు ఆదేశాల మేరకు స్థానిక నాయకుల సమక్షంలో శ్మశాన స్థలాన్ని సర్వే చేయించి సరిహద్దు రాళ్లు వేయించినట్లు తెలిపారు.

భైరవమూర్తికి పలువురి పరామర్శ

తాళ్లరేవు: ఇటీవల హైదరాబాద్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పొన్నాడ భైరవమూర్తిని బుధవారం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ దడాల జగదీష్ తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ పరీక్షకు రెండు సెంటర్లు

యానాం: అసిస్టెంట్ (టైర్-2) రాత పరీక్షను ఈనెల 22న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి యానాంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బుధవారం డీపీ అండ్ఆర్ ఎగ్జామ్ సెల్ కార్యదర్శి వి జయశంకర్ తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆక్వా అక్రమ సాగును నిలిపి వేయాలి

కాట్రేనికోన: లక్ష్మీవాడ పంచాయతీ పరిధిలోని అక్రమ ఆక్వా సాగును ప్రజారోగ్యం దృష్ట్యా నిలిపి వేయాలని గొరగనమూడి గ్రామానికి చెందిన దళిత మహిళలు ఆందోళన చేసారు. చేపల చెరువులు పేరుతో ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకుని, రొయ్యలు సాగు చేస్తున్నారని వారు బుధవారం ఆరోపించారు.

ఆయుష్ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

యానాం: స్థానిక ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రిని ఆర్ఏఓ మునిస్వామి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వివిధ సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయుర్వేద చికిత్సకు సంబంధించి మందులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ ధీర వనిత ఝాన్సీలక్ష్మీబాయి వర్థంతిని బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

అభాగ్యులకు అండగా..

- స్ఫూర్తిదాయకంగా ఉమా మనోవికాస కేంద్రం నిర్వహణ
- రిలయన్స్ ఆర్థిక సహకారంతో ఉచిత సేవలు
- మానసిక దివ్యాంగులకు వరం
- ప్రత్యేకావసరాలు గల పిల్లలకు విద్య, ప్రత్యేక తర్ఫీదు
- సెంటర్ విస్తరణతో మరింతగా సేవలు


కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం


సేవలు అందిస్తున్న ఫిజియోథెరపీ వైద్యుడు శ్రీకాంత్

తాళ్లరేవు: మానసిక దివ్యాంగులకు కోరంగి పంచాయతీ సీతారామపురంలో ఉన్న ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్ (రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం) వరంగా మారింది. రిలయన్స్ సంస్థ సహకారంతో ఉమా మనో వికాస కేంద్రం, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ నిర్వహణలో అనేక మందికి ఉచిత సేవలందిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తోంది. మానసిక వికలాంగులను అక్కున చేర్చుకుని వారిని సకలాంగులుగా తీర్చిదిద్దడం, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, భోజన వసతితోపాటు అనేక సేవలతో ప్రజల మన్ననలు చూరగొంటోంది. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ఇక్కడకు వచ్చి ఈ కేంద్రం సేవలను పొందుతున్నారు.

2009లో సెంటర్ ప్రారంభం

తాళ్లరేవు మండలంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్మించిన అనంతరం వారి ఆర్థిక సహాయంతో 2009లో రిలయన్స్ ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ పేరిట సేవలను ప్రారంభించారు. ఉమా మనో వికాస కేంద్రం సహకారంతో దివ్యాంగుల పాఠశాలతోపాటు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు. ప్రధానంగా ఈ కేంద్రంలోని ప్రత్యేక తర్ఫీదు పొందిన సిబ్బంది తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన మానసిక దివ్యాంగులను గుర్తించి వారిని సాధారణమైన పిల్లలుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటారు. వారిలో మార్పు తీసుకురావడంతోపాటు వారికి ప్రత్యేకమైన విద్యనందించి సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు.


మానసిక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణనిస్తున్న సిబ్బంది

ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు

ఇటీవల అధిక శాతం మంది కాళ్లు, చేతులు, మెడ తదితర నొప్పులతో బాధపడడం చూస్తున్నాం. వీటికి ప్రధానంగా మందులతోపాటు ఫిజియోథెరపీ చేయిస్తేనే శాశ్వతంగా నయమవుతుందని వైద్యులు చెబుతుంటారు. ప్రముఖ నగరాల్లో మాత్రమే ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉండడం, ఆ వైద్యం సైతం ఖరీదు కావడంతో చాలామంది వైద్యం చేయించుకోలేక బాధపడుతుంటారు. ఈ కేంద్రంలో ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించడం విశేషం. వివిధ రకాలైన నొప్పులతో బాధపడుతూ ఈ కేంద్రానికి వచ్చేవారికి చికిత్స అందించి సత్ఫలితాలు సాధిస్తున్నారు. ధనిక, పేద తేడా లేకుండా వైద్యం కోసం వచ్చిన వారందరికీ సేవలందించడం ఈ కేంద్రం ప్రత్యేకత. దీంతో ఈ కేంద్రం ఫిజియోథెరపీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అలాగే స్పీచ్‌థెరపీ, మ్యూజిక్ అండ్ యోగా థెరపీ, ఒకేషనల్ ట్రెనింగ్ తదితర సేవలను అందిస్తున్నారు. 13 ఏళ్లుగా నిరాటంకంగా సేవలు కొనసాగుతున్నాయి.

మరిన్ని సేవలు విస్తరిస్తాం



రిలయన్స్ వ్యవస్థాపకులు ధీరూబాయి అంబానీ పేరిట కేంద్రాన్ని నిర్వహిస్తూ అనేక సేవలను ప్రజలకు అందిస్తున్నాం. ముఖ్యంగా మానసిక దివ్యాంగులకు అందించే సేవలు ఎనలేనివి. సిబ్బంది ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం. భవనం పై అంతస్తువేసి మరింత మందికి సేవలందించేందుకు సిద్ధం చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మానసిక దివ్యాంగులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు.

– సుబ్రహ్మణ్యం, రిలయన్స్ ప్రతినిధి

మానసిక దివ్యాంగులకు వరం



మేనరిక వివాహాలు, ఇతర పౌష్టికాహార లోపం తదితర కారణాలతో కొంతమంది పిల్లలు మానసిక దివ్యాంగులుగా మారుతున్నారు. తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో అధిక శాతం మంది మానసిక దివ్యాంగులు ఉంటున్నారు. అటువంటి వారిని గుర్తించి వారికి రిలయన్స్ ఆర్థిక సహాయంతో నిపుణులైన ఉపాధ్యాయులతో ఉచితంగా కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు ఉచిత విద్య, ఉచిత భోజనం, రవాణా తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– ఎంవీ గోపాల్, రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం ఇన్‌చార్జ్

ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెకు సంఘీభావం


అమలాపురంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: అవుట్ సోర్సింగ్ ఉద్యోగులైన మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు 40 రోజులుగా సమ్మె చేస్తున్నా వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు వైఎస్సార్ సీపీకి చెందిన పాలకపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని పార్టీకి చెందిన కౌన్సిలర్లు బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణితోపాటు పార్టీ కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, నాగారపు వెంకటేశ్వరరావు, దొమ్మేటి రాము, బండారు గోవిందు, కట్టోజు సన్న య్యదాసు, చిత్రపు రామకృష్ణ, కొల్లాటి దుర్గాబాయి తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు.

సమస్యలకు ప్రభుత్వమే కారణం

అమలాపురంలో ఓ పక్క పంట కాలువపై రెండు వంతెనల నిర్మాణాలు చేపట్టడం, మరో పక్క ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మె చేపట్టడంతో తాగునీరు, వీధి లైట్ల సమస్యలు అధికమయ్యాయని వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆనందరావు ఈ సమ్మెను ఉద్దేశించి మున్సిపల్ కౌన్సిల్ వైఫల్యంగా వ్యాఖ్యానించడం భావ్యం కాదని కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెను పరిష్కరించాలని వారు కోరారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవడం తగదు

అధికారుల తీరుపై ఎమ్మెల్యే అశోక్ అసహనం


పీడబ్ల్యూడీ కార్యాలయంలో పరిపాలనాధికారి మునిస్వామిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్యే ల్యాడ్, ఆది ద్రావిడ, సీఎస్ఆర్ తదితర నిధులను తాను తీసుకువస్తుంటే భూమి పూజ చేయకుండా నామినేటెడ్ పదవితో ఉన్న మల్లాడి కృష్ణారావు వచ్చే వరకు అధికారులు నిలుపుదల చేయడం దారుణమని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ విమర్శించారు. అభివృద్ధి పనులకు భూమి పూజ చేయకుండా పరిపాలనాధికారి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడంపై ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి అందించిన రూ.55 లక్షలతో అభివృద్ధి పనులకు బుధవారం బ్రహ్మానందగర్‌లో భూమి పూజ చేయడానికి నిర్ణయించగా పీడబ్ల్యూడీ ఇంజినీర్లు మల్లాడి వచ్చేవరకు ఆగాలని చెప్పారని, ఈ మేరకు ఆర్ఏఓ నుంచి ఆదేశాలు వచ్చాని చెప్పారన్నారు. దీనిపై తాను ఆర్ఏఓను ప్రశ్నించానని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. ఈ ఐదేళ్లూ అభివృద్ధి పనులు జరిగితే తనకు ప్రజల్లో పేరువస్తుందనే ఏకైక కారణంతో కక్ష సాధిస్తున్నారన్నారంటూ అధికారులపై ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హామీల అమలులో కూటమి విఫలం


జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించిన శ్రీకాంత్

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కో–ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసంలో శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏడాది పాలన వైఫల్యాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రచురించిన జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ పథకాలు చేయకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి,ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు సంసాని బుల్లినాని, గుత్తుల చిరంజీవిరావు, బద్రి బాబ్జి,కొనుకు బాపూజీ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, డీసీసీబీ మాజీ డైరెక్టర్ జిన్నూరి బాబీ, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి బాబు, కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, దొమ్మేటి రాము, నాగారపు వెంకటేశ్వరరావు, కట్టోజు సన్యాయిదాసు, నాయకులు వంటెద్దు వెంకన్న నాయుడు, సుదా గణపతి, కుడిపూడి భరత భూషణ్, దొంగ చిన్న, కేతా భాను తేజ, మద్దింశెట్టి ప్రసాద్, కముజు రమణ, పొగాకు శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు

అమలాపురం రూరల్: ఎన్నికల హామీలను విస్మరించిన సీఎం చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండలం భట్నవిల్లిలోని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం వద్ద నిర్వహించిన అల్లవరం మండలస్థాయి కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సమక్షంలో ×జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం® పుస్తకాన్ని బుధవారం అమలాపురం అసెంబ్లీ నియోజవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌తో కలసి శేషగిరిరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, నాయకులు జేమ్స్, కృష్ణమూర్తి, రేవు సుదర్శన్ రావు, విక్రమ్, తిక్కవెంకట ప్రసాద్‌వడ్డి గంగ, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు ఘన నివాళి

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వాకర్స్ మాజీ గవర్నర్, మాజీ వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ పచ్చిగోళ్ల శ్రీనివాసరావు మృతి వాకర్స్ ఉద్యమానికి తీరని లోటని వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర అన్నారు. స్థానిక దొడ్డివారి అగ్రహారంలోని బంగారు, వెండి వర్తకుల భవనంలో బుధవారం నిర్వహించిన వాకర్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో పలువురు శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సంతాప సభలో శ్రీనివాసరావుతోపాటు వాకర్స్ ఉద్యమకారుడు చంద్రమౌళి మృతికి వారు సంతాపం తెలిపారు. వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ ప్రతినిధులు శ్రీనివాసరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కోరింగా అభయారణ్యంలో ట్రైనీ ఐఏఎస్‌లు


కోరింగా అభయారణ్యంలో బోటు షికారు చేస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక ప్రదేశమైన కోరింగ అభయారణ్యాన్ని బుధవారం ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. వారు అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలను తిలకించారు. అనంతరం బోటు షికారు చేసారు. ఈ సందర్భంగా అభయారణ్యంలో మడ అడవుల విశిష్టత, పక్షుల తదితర వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు, కె.సిద్ధార్థ, ఎఫ్‌బీఓ జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, కె.ధనుంజయరావు, సీబీఈటీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నర్సింగ్ విద్యార్థుల ప్రదర్శన

యానాం: స్థానిక ఎస్ఎస్ఎ కాన్ఫరెన్స్ హాలులో పుదుచ్చేరి ఆయుష్ శాఖ, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మదర్ థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులు బుధవారం యోగా భంగిమలతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కిరణ్‌కుమార్‌కు ప్రథమ స్థానం


పవర్ లిఫ్టింగ్ పోటీల విజేత కిరణ్‌కుమార్‌ను సత్కరించి అభినందిస్తున్న క్రీడాకారులు, జిమ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇటీవల నిర్వహించిన 12వ ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక జీకే ఫిట్‌నెస్ జిమ్ పవర్ లిఫ్టర్ చీకురుమిల్లి కిరణ్‌కుమార్ 74 కేజీల మాస్టర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్థానిక జిమ్‌లో కిరణ్‌కుమార్‌కు బుధవారం నిర్వహించిన అభినందన సత్కార సభకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అతిథిగా పాల్గొని కిరణ్‌కుమార్ క్రీడా ప్రతిభను కొనియాడారు. జిమ్ కోచ్ డి.గోపీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ అభినందన సభలో విజేత కిరణ్‌కుమార్‌ను పలువురి ప్రశంసించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల జిల్లా కన్వీనర్ చీకట్ల కిషోర్, క్రీడాకారులు కల్వకొలను ప్రవీణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలి

అమలాపురం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా రేషనలైజేషన్ పేరుతో వీఆర్వో పోస్ట్లను తగ్గించడం అన్యాయమని, పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన పాత పద్ధతిలోనే ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. వీఆర్వోల సమస్యలపై అంబేడ్కర్ కోనసీమ వీఆర్వోల సంఘం, రాష్ట్ర రెవెన్యూ జేఏసీ జేఏసీ చైర్మన్ వాసా దివాకర్, వీఆర్వోల రాష్ట్ర ప్రచార కార్యదర్శి, కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ నిషాంతి, డీఆర్ఓ రాజకుమారిని కలసి వారు వినతిపత్రాలు అందించారు. గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,500 మంది వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపడం సరికాదని అన్నారు. జిల్లా జాయింట్ కార్యదర్శి పి. శివరామకృష్ణ, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల స్వామి నాయుడు, కొత్తపేట డివిజన్ సెక్రటరీ కారుకొండ శ్రీను, జిల్లా నాయకులు రాజేష్, జయరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు అధికారులు సహకరించాలి

అమలాపురం రూరల్: జిల్లాలోని వివిధ శాఖలు వాణిజ్య పన్నుల వసూలుకు సహకరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వాణిజ్య పన్నులు, జీఎస్టీ వసూలుపై వివిధ శాఖల అధికారుల సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ జై నీరజ, డిప్యూటీ కమిషనర్ జి నిర్మల జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్లు ఎన్, సుబ్బారావు టీ, ధర్మారావు, మహేష్ గిరిశాస్త్రి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీం కింద సర్క్యూట్ టెంపుల్ టూరిజం ప్రతిపాదించాలి

కోనసీమ జిల్లాలో ప్రసాద్ స్కీం కింద సర్క్యూట్ టెంపుల్ టూరిజం ప్రతిపాదించాలని, బీచ్ టూరిజం, హెరిటేజ్ హోం స్టే, బోటింగ్ టూరిజం అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా పర్యాటక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రసాద్ స్కీం కింద జిల్లాలోని ఐదు ప్రముఖ దేవాలయాల సర్క్యూట్ టూరిజం మాస్టర్ ప్లాన్ ఆగస్టు నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్కిటెక్చర్ కిరణ్ టూరిజం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. వాడపల్లి, ద్రాక్షారామం, అయినవిల్లి, అంతర్వేది, అప్పనపల్లి దేవాలయాలు, పాసర్లపూడి, ఆదుర్రు ప్రాంతాల టూరిజం అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలన్నారు. కేసనపల్లి, దిండిలో హెరిటేజ్ హోం స్టే గృహాలను ప్రస్తుతానికి గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఎస్.యానం ప్రాంతంలో బోటింగ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ పవన్ కుమార్ సంపత్, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సత్యనారాయణ, వివిధ దేవాలయాల కార్యనిర్వహక అధికారులు పాల్గొన్నారు.


పవర్ టిల్లర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

వ్యవసాయ పనిముట్ల పంపిణీ

జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ కింద 521 వ్యవసాయ పనిముట్లను రూ. 393 లక్షల రాయితీతో రైతులకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రైతులకు కలెక్టర్ చేతులమీదుగా 2024–25 వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఈడీఈ, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.